సాక్షి ములుగు

మంగళవారం | 25 | ఏప్రిల్ | 2023



క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే నిందితులను మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో▸



మహబూబాబాద్ డీడీకి పుత్రశోకం

ఐటీడీఏ పరిధిలోని మహబూబాబాద్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మంకిడి ఎర్రయ్యకు పుత్రశోకం మిగిలింది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
37.6⁰ /24.0⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సెలవులు ముగియగానే బడికి పంపించండి



వాజేడు: విద్యార్థులకు సెలవులు ముగిసిన వెంటనే బడికి పంపించాలని జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు సెలవు రోజుల్లో కూడా పిల్లలను బయట తిరగ నివ్వకుండా చదువుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్వరూప్ సింగ్ ఉన్నారు.

జాతర వేలం పాటలు మరోసారి వాయిదా

మంగపేట: శ్రీ హేమాచల క్షేత్రంలో వచ్చే నెలలో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాల జాతర వేలం పాటలను సోమవారం రెండో సారి వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ సత్యనారాయణ తెలిపారు. శ్రీ హేమాచల క్షేత్రంలో మే 1 నుంచి 10వ తేదీ వరకు లక్ష్మీనర్సింహ స్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు(జాతర) అత్యంత వైభవంగా జరుగనున్నాయి. జాతర సందర్భంగా నేటి నుంచి మే 24 వరకు నెల రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు నేటి నుంచి ఆలయ ప్రాగణంలో కొబ్బరి కాయలు, పూజా సామగ్రి, తలనీలాలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు నిర్వహించిన వేలం పాటలు వాయిదా పడ్డాయి.

విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

ములుగు రూరల్: విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ సాయికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంతరాయం కలుగుతుందని వివరించారు. జిల్లా కేంద్రంలోని ప్రగతి, శ్రీనివాస్ కాలనీ, గట్టమ్మపల్లి, మహర్షి కళాశాల ప్రాంతాల్లో సరఫరా నిలిపేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ సాధించడమే లక్ష్యం



ములుగు రూరల్(గోవిందరావుపేట): ఎస్సీ వర్గీకరణ సాధించడమే లక్ష్యంగా ఎమ్మార్పీస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ అన్నారు. గోవిందరావుపేట మండలం పస్రాలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లెల్లో దండోరా జెండాలను ఎగరవేయాలన్నారు. మాదిగ జాతి హక్కుల సాధనకు ఉద్యమాలను చేపట్టాలన్నారు. ఉద్యమంలో మాదిగ విద్యార్థులు భాగసామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇరుగు పైడి, బుర్రి సతీష్, జన్ను రవి, నెమలి నర్సయ్య, స్వామి, ప్రసాద్, సాంబశివరావు, రవీందర్, రాంబాబు, బలరాం, సారయ్య, ఎల్లన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

ఏటూరునాగారం: ఉమ్మడి వరంగల్ జిల్లా ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏఎస్‌యూ) పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్నిబెల్లి గణేష్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటూరునాగారం గిరిజన భవన్‌లో రెండు రోజుల పాటు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. 1992లో ఏర్పాటు అయిన ఆదివాసీ విద్యార్థి సంఘానికి జీవం పోసింది పూర్వ విద్యార్థులే అన్నారు. ఆదివాసీ విద్యార్థి సంఘం ఏర్పాటు అనంతరం 1996లో తుడుందెబ్బ ఉద్యమానికి జీవం పోశారన్నారు. అటువంటి విద్యార్థి నాయకుల ఉద్యమాలు నేడు మూగపోయాయన్నారు. ఇది ఆదివాసీ ఉద్యమానికి ప్రమాదకరమన్నారు. ఉమ్మడి వరంగల్‌లో ఆదివాసీ విద్యార్థి ఉద్యమ పాత్ర చాలా గొప్పదన్నారు. అందుకే పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించి గత అనుభవాలు, ఉద్యమాలపై సుదీర్ఘ చర్చ చేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సిద్ధబోయిన కార్తీక్, ఉపాధ్యక్షులు ఆలం నాగేష్ జిల్లా అధ్యక్షుడు దబ్బగట్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రామప్పకు వరం 'ప్రశాద్'

దేవాలయంలో పర్యాటకులకు సకల సౌకర్యాలు

- 37 ఎకరాల్లో రూ.62కోట్లతో ప్రాజెక్టు పనులు
- మొదటి విడతగా రూ.42 కోట్ల నిధులు మంజూరు



ప్రశాద్ ప్రాజెక్టు పథకం కింద చేస్తున్న పిల్లర్ల పనులు

వెంకటాపురం(ఎం): రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు రావడంతో దేశ, విదేశాల నుంచి పర్యాటకులు అధికసంఖ్యలో తరలివస్తున్నారు. రామప్పకు వచ్చే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ రామప్ప ఆలయాన్ని తీర్థయాత్రల పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి పథకం (ప్రశాద్ ప్రాజెక్టు) జాబితాలో చేర్చింది. దీంతో ప్రశాద్ ప్రాజెక్టు పథకం కింద రూ.61.99 కోట్ల నిధులను కేటాయించనున్నారు. ఇందులో మొదటి విడతగా రూ.42.14 కోట్ల నిధులను కేంద్ర పర్యాటకశాఖ మంజూరు చేసింది. రామప్ప ఆలయ తూర్పు ముఖద్వారం ఎదురుగా ఉన్న ప్రభుత్వ విత్తనాభివృద్ధి క్షేత్రానికి సంబంధించిన 37 ఎకరాల భూమిని ప్రభుత్వం టూరిజం శాఖకు అప్పగించగా ఆ భూమిలో అభివృద్ధి పనులను టూరిజం అధికారులు వారం రోజులుగా చేయిస్తున్నారు.

రెండో విడతగా చేపట్టే పనులు

రెండో విడతగా మిగిలిన రూ.19.85 కోట్ల నిధులు మంజూరైతే 27 ఎకరాల్లో పర్యాటకులకు విశ్రాంతి భవనాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సీసీ కెమెరాల ఏర్పాటు, పార్కింగ్ సదుపాయం, రామప్ప రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్, హోటళ్లు, ప్రహరీ నిర్మాణం చేపట్టనున్నారు. అంతేకాకుండా రామప్ప సరస్సులో ఫ్లోటింగ్ జెట్టి బోట్, క్రూయిజ్ బోట్‌లను ఏర్పాటు చేయనున్నారు. పనులన్నీ రెండేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రశాద్ ప్రాజెక్టు కింద చేపట్టిన పనులన్నీ సకాలంలో పూర్తయితే పర్యాటకులకు సకల సౌకర్యాలు అందుబాటులోకి రావడమే కాకుండా రామప్ప ఆలయానికి పర్యాటకుల సంఖ్య కూడా విపరీతంగా పెరిగే అవకాశం ఉంటుంది.



మొదటి విడత పనుల నమూనా చిత్రం



ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ నమూనా



రెండో విడతలో చేపట్టనున్న పనులు

అభివృద్ధి పనులు ఇవే..

మొదటి విడతగా మంజూరైన రూ.42.14 కోట్లతో 10 ఎకరాల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నారు. మంజూరైన నిధులతో ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ రెండు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తారు. ఇందులో పర్యాటకుల సమాచార కేంద్రం, వెయిటింగ్ హాల్, మీటింగ్ హాల్, జ్ఞానకేంద్రం, ఆధ్యాత్మిక కేంద్రం, చారిత్రక సాంస్కృతిక కేంద్రం, చిత్రకళామందిర్ (4డీ మూవీహాల్), టాయిలెట్ బ్లాక్, మెడికల్ రూంలు ఉంటాయి. వీటితో పాటు ఫుడ్ కోర్టు, స్టాల్స్, కాకతీయ కళాతోరణం, ఫౌంటేన్, సెక్యూరిటీ క్యాబిన్, చిల్డ్రన్స్ పార్కు నిర్మించడంతో పాటు ల్యాండ్ స్కేపింగ్ అంశాలతో విహార ప్రదేశంగా తీర్చిదిద్దనున్నారు.

కాంగ్రెస్ హయాంలో సంచినిండా సరుకులు

- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర 39వ రోజు సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ నుంచి ప్రారంభమై కానిపర్తి, శంభునిపల్లి, ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లి, ఆరేపల్లి, బావుపేట క్రాస్‌రోడ్ నుంచి హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్, హసన్‌పర్తిల మీదుగా కాకతీయ యూనివర్సిటీ వరకు సాగింది. రాత్రి హసన్‌పర్తిలో జరిగిన కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

– కమలాపూర్/ఎల్కతుర్తి

- 8లో▸



హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లో గజమాలతో భట్టికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న కలెక్టర్ కృష్ణ ఆదిత్య

ములుగు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాండ్ అండ్ ట్రైనింగ్ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ 2016 రూల్ ప్రకారం మెడికల్ వేస్టేజీను ప్రత్యేక మిషన్‌లో నిల్వ ఉంచి దహనం చేయాలన్నారు. కాలుష్య నియంత్రణను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యావరణ ఇంజనీర్ సునిత, ఎన్ఐటీ ప్రొఫెసర్ ఆనంద్ కిషోర్‌లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఆస్పత్రుల్లో మెడికల్ వేస్టేజ్ కోసం వైట్, బ్ల్యూ, రెడ్ కలర్ డబ్బాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వరంగల్ మెడికల్ కళాశాలతో సమన్వయం చేసుకొని వేస్టేజీను అక్కడికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆస్పత్రులు పశు వైద్యకేంద్రాల్లోని వ్యర్థ పదార్థాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నారు. 20 పడకల కంటే ఎక్కువగా ఉన్న ఆస్పత్రులు తప్పనిసరిగా బయోమెడికల్ ఆర్థరైజేషన్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఇలా త్రిపాఠి, వైవీ గణేశ్, అసిస్టెంట్ సైంటిస్ట్ మానస, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్, జిల్లా పశువైద్యాధికారి విజయభాస్కర్ అధికారులు పాల్గొన్నారు.


సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గురుకుల క్రీడా పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న స్పార్కిల్స్ సమ్మర్ క్యాంప్‌ను ఆమె సోమవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. డ్యాన్స్, డ్రాయింగ్, కంప్యూటర్ ట్రైనింగ్, లైఫ్ స్కిల్స్ వంటివి చక్కగా నేర్చుకోవాలన్నారు. 15 రోజుల పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని పాఠశాల యజమాన్యాన్ని ఆమె ఆదేశించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరాజు, ఉపాధ్యాయులు, ట్రైనర్స్ ఉన్నారు.

రామప్పను సందర్శించిన ఫారెస్ట్ అధికారులు



రామప్పలో ఫారెస్ట్ అధికారుల బృందం

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని రామప్ప దేవాలయాన్ని భూపాలపల్లి ఎఫ్ఆర్ఓ కరుణాకర్ రావు ఆధ్వర్యంలో కొత్తగూడెం, పాల్వంచ, సత్తుపల్లికి చెందిన ఫారెస్ట్ ఫీల్డ్ సూపర్‌వైజర్లు, వాచర్లు సోమవారం సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామికి వారు పూజలు నిర్వహించగా ఆలయ అలయ అర్చకుడు ఉమాశంకర్ తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. గైడ్ విజయ్‌కుమార్ ఆలయ విశిష్టత గురించి ఫారెస్ట్ బృందానికి వివరించారు. అనంతరం పాలంపేట శివారులోని కేన్ ప్రాంతాన్ని పరిశీలించి కేన్ మొక్కల ప్రాధాన్యతను తెలుసుకున్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ములుగు రూరల్: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో చలో హైదరాబాద్ వాల్ పోస్టర్‌ను సోమవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీన హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఐకేపీ గ్రామీణ హమాలీ, గోదాముల్లో ఎగుమతి, దిగుమతి పనులు నిర్వహిస్తున్న హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. 55 సంవత్సరాలు నిండిన హమాలీలకు నెలకు రూ. 6 వేలు పెన్షన్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొమురయ్య, రఘు, బాలరాజు, చక్రపాణి, నర్సయ్య, అనిల్, స్వామి, రవి, రాములు, సాంబయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న భిక్షపతిగౌడ్

ములుగు: జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని జిల్లా గౌడ ఐక్యవేదిక జేఏసీ అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఇలా త్రిపాఠికి వినతిపత్రాన్ని అందించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరిగౌడ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ బట్ట మురళీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా గౌడ్స్ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరఫున స్థలం కేటాయిస్తే విగ్రహ ఏర్పాటుకు తమవంతుగా ప్రయత్నాలు చేసుకుంటామన్నారు. దీంతో పాటు జిల్లాకేంద్రంలో గౌడ కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి కారుపోతుల యాదగిరి, ముసినెపల్లి కుమార్, ఓడ రాజు, పైడిమల్ల రంజిత్, తోటకూరి శ్రీకాంత్, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గుండెబోయిన రవి, కెక్కర్ల అశోక్, ప్రకాశ్, నాగేశ్వర్, రమేష్, సదానందం, సారంగపాణి, సాయి, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించండి

- కలెక్టర్ కృష్ణ ఆదిత్య
- ప్రజావాణిలో వినతులు స్వీకరించిన కలెక్టర్



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్



వినతి పత్రం స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ అంకిత్

ములుగు: గ్రీవెన్స్ సెల్‌లో ప్రజల నుంచి అందే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ సోమవారం వినతులు స్వీకరించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 43 దరఖాస్తులు రాగా అందులో భూ సమస్యలపై 15, పింఛన్ల మంజూరుపై 8, డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని 6, ఇతర సమస్యలపై 14వినతులు వచ్చాయి. వీటిలో కొన్నింటిని అధికారుల సమక్షంలో అక్కడికి అక్కడే పరిష్కరించారు. మిగతా వాటిని ఆయా శాఖలకు కలెక్టర్ సిఫారసు చేశారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంకటాపురం(కె), కన్నాయిగూడెం మండలాల్లో జూనియర్ కళాశాల ఏర్పాటుకు, భవన నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి అందించాలన్నారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల సంఖ్యను సేకరించి అందించాలని ఆదేశించారు. ఎదిర రోడ్డు పనులు పెండింగ్‌లో లేకుండా చూడాలని సూచించారు. రైతు వేదికల్లో లేబర్ మానిటరింగ్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. రామప్పలో సీబీఎఫ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన మంత్రి ఎంప్లాయిస్ జనరేషన్ ప్రోగ్రాం ద్వారా రామప్ప, మల్లూరు, బుస్సాపూర్, మేడారం, నార్లాపూర్ చుట్టు పక్కల గ్రామాల యువతకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని పరిశ్రమల శాఖ అధికారిని ఆదేశించారు. పాలంపేటలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలల ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. ఇలా పలు విషయాలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఇలా త్రిపాఠి(స్థానిక సంస్థలు), వైవీ గణేశ్(రెవెన్యూ), జెడ్పీ డిప్యూటీ సీఈఓ రమాదేవి, ఆర్ అండ్ బీ ఈఈ వెంకటేష్, పీఆర్ ఈఈ జగదీశ్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్, సీపీఓ ప్రకాశ్, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ తుల రవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజ్‌కుమార్, డీవైఎస్ఓ వెంకటరమణచారి, డీఎంహెచ్ఓ విజయభాస్కర్, డీసీఓ సర్దార్‌సింగ్, డీఏఓ గౌస్‌హైదర్ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ తెలిపారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వినతులను స్వీకరించారు. మంగపేట మండలం మల్లూరు నర్సింహస్వామి గుట్ట కింద గల ప్రాంతంలో నివాసం ఉంటున్న నాయకపోడులు తమ భూములను తమకు ఇప్పించాలని గిరిజన రైతులు పెద్ద సతీష్, పుల్లయ్య, రామారావు, ఆదినారాయణ పీఓను వేడుకున్నారు. తనకు ఆసరా పింఛన్ మంజూరు అయ్యిందని, ఎంపీడీఓ కార్యాలయంలో తప్పుడు బ్యాంక్ అకౌంట్ నంబర్ ఇవ్వడం వల్ల ఆసరా పింఛన్ డబ్బులు తమ అకౌంట్‌లో జమ కావడం లేదని, సరైన అకౌంట్ నంబర్ ఇచ్చినప్పటికీ పింఛన్ పడటం లేదని బాధితుడు పూనెం బాబు విన్నవించారు. ఫోరం ఫర్ గుడ్ అవేర్నెస్ సంస్థ అడవులు అంతరించిపోవడం వల్ల వర్షాలు రావడం లేదని, వాతావరణం దెబ్బతింటుందని పోడు భూములకు పట్టాలు ఇవ్వొద్దని హైకోర్టులో కేసు వేయగా దానిని సవాల్ చేస్తూ తుడుందెబ్బ పిల్‌వేసి పోడు భూములకు పట్టాలు ఇవ్వడం వల్ల జరిగే లాభాలను కోర్టుకు వివరించామని ఇలా పలు సమస్యలపై గిరిజన దర్బార్‌లో వచ్చిన వినతులు పరిశీలించి ఆయా సెక్టార్ అధికారుల ద్వారా పరిష్కరించే విధంగా చూస్తామని పీఓ తెలిపారు. 19 దరఖాస్తులను పరిశీలించి గిరిజనుల సమస్యను తీర్చేవిధంగా దృష్టి పెడుతామన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ఎస్ఓ రాజ్‌కుమార్, ఈఈ హేమలత, పీహెచ్ఓలు భారతి, రమణ, డిప్యూటీ డీఎంహెచ్ క్రాంతి, సీడీపీఓ హేమలత, ఏఓ దామోదరస్వామి, ఏడీఏ శ్రీధర్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

'ఈటలను విమర్శించే హక్కు సీతక్కకు లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

ములుగు రూరల్: ఈటలను విమర్శించే హక్కు ఎమ్మెల్యే సీతక్కకు లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సీతక్క గెలిచినప్పటి నుంచి నియోజకవర్గానికి చేసింది ఏమీలేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఢిల్లీలో దోస్తీ, తెలంగాణలో కుస్తీ చేస్తున్నట్లు నటిస్తున్నారన్నారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రేవంత్ రెడ్డి మెప్పు కోసమే ఈటల రాజేందర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ సిరికొండ బలరాం, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, పోరిక ఉత్తమ్‌కుమార్, జినుకల కృష్ణాకర్, ప్రమోద్‌రెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు రూరల్: పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మల్లంపల్లి, శ్రీనగర్ గ్రామాల్లో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను కాంగ్రెస్ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాల కారణంగా నేలవాలాయన్నారు. నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రభుత్వం పంటనష్టం అంచనా వేసి రైతులకు ఎకరాకు రూ. 50 వేల పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు ఎండి చాంద్‌పాషా, ఆకుతోట చంద్రమౌళి, నల్లెల్ల భరత్‌కుమార్, గోల్కొండ రవి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాకిట రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ల్యాద శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు మంగళవారం నుంచి మే 4 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు టైంటేబుల్ ప్రకారం రోజు రెండు సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2–30 నుంచి సాయంత్రం 5–30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పదో తరగతి పరీక్షలు ఉదయం , మధ్యాహ్నం ఉంటాయి. అలాగే ఇంటర్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఉంటాయి. సబ్జెక్టుల ప్రకారం ఏ సమయంలో ఉంటే ఆ సమయంలో పరీక్షలకు హాజరవుతారు. నిర్దేశించిన సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ డీఈఓ ఎండీ. అబ్దుల్‌హై , ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.శంకర్‌రావు సోమవారం తెలి పారు. ఇంటర్‌లో ఆరు జిల్లాలు కలిపి 4,518 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. టెన్త్ పరీక్షలకు 2,567 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు.

ఆత్మహత్యకి ప్రేరేపించిన వ్యక్తికి జైలు

ములుగు రూరల్(గోవిందరావుపేట): ఆత్మహత్యకి ప్రేరేపించిన వ్యక్తికి జైలుశిక్ష విధిస్తూ ములుగు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి మాధవి సోమవారం తీర్పునిచ్చారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగాపూర్ గ్రామానికి చెందిన యువతి, అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెండు సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. పెద్దల సమక్షంలో యువతి చదువు పూర్తయిన తర్వాత వివాహం చేసుకుంటానని ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో తన చెల్లితో శ్రీకాంత్ మాట్లాడడాన్ని గమనించిన అక్క మందలించింది. మనసులో పెట్టుకున్న శ్రీకాంత్ మరుసటి రోజు యువతి ఇంటికి చేరుకొని నీవు చనిపోతే సమస్యలు పరిష్కారమవుతాయని గట్టిగా అనడంతో మనస్థాపానికి గురైన యువతి ఇంట్లో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స పొందుతూ మరణించింది. మృతురాలి తల్లి ఈక సరోజన 2018 డిసెంబర్ 09న అప్పటి ఎస్సై మహేందర్ కుమార్‌కు ఫిర్యాదు చేసింది. శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. సోమవారం ఏపీపీ సత్యనారాయణ వాదనలతో ఏకీభవించిన అసిస్టెంట్, సెషన్స్ కోర్టు జడ్జి మాధవి శ్రీకాంత్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించింది.

కాంగ్రెస్ హయాంలో సంచినిండా సరుకులు

- బీజేపీ పాలనలో మాయం
- పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క
- కాకతీయ యూనివర్సిటీలో రాత్రి బస

కమలాపూర్/ఎల్కతుర్తి: కాంగ్రెస్ హయాంలో రేషన్ షాపుల్లో నిరుపేదలకు సంచినిండా సరుకులిస్తే, బీజేపీ ప్రభుత్వంలో అవన్నీ మాయమయ్యాయని సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర 39వ రోజు సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ నుంచి ప్రారంభమై కానిపర్తి, శంభునిపల్లి, ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లి, ఆరేపల్లి, బావుపేట క్రాస్‌రోడ్ నుంచి హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్, హసన్‌పర్తిల మీదుగా కాకతీయ యూనివర్సిటీ వరకు సాగింది. రాత్రి యూనివర్సిటీలో బస చేశారు. ముందుగా కానిపర్తిలో వరి కోతలు కోస్తున్న మహిళా కూలీలు రజిత, సరోజనలతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. శంభునిపల్లి బ్రిడ్జిపై వరి ధాన్యం ఆరబోసిన మోడెం సంధ్యారాణితో మాట్లాడారు. వడ్లు బాగా ఎండితేనే కొంటామని కొనుగోలు కేంద్రాల్లో చెబుతున్నారని, ఇటీవల కురిసిన అకాల వర్షానికి 250 బస్తాల వడ్లన్నీ తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేసింది. మహిళా రైతుకు చేయూతగా ఆమె ఆరబోసిన వరి ధాన్యాన్ని కాసేపు భట్టి తిరగేశారు. శంభునిపల్లికి చెందిన రైతు కట్కూరి తిరుపతిరెడ్డితో మాట్లాడారు. కానిపర్తి శివారులోకి చేరుకోగానే ఓ గీత కార్మికుడు తెచ్చిన ముంజలను భట్టితోపాటు నాయకులు ఆరగించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క గౌడన్నల మోకు, ముత్తాదు ధరించి గీత కార్మికుడు స్వామిని శాలువాతో సన్మానించారు.



కమలాపూర్ : శంభునిపల్లి వద్ద వరి ధాన్యం తిరగబోస్తున్న భట్టి విక్రమార్క



ఎల్కతుర్తి మండలం బావుపేటకు చేరుకున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భట్టివిక్రమార్క

యాత్ర 400 కిలోమీటర్లు పూర్తి

యాత్ర 400 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎల్కతుర్తి మండలం గుంటూర్‌పల్లి వద్ద కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. బావుపేట గ్రామంలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయనున్నట్లు వెల్లడించారు. బీసీ సబ్‌ప్లాన్ తీసుకువస్తామని చెప్పారు. ఇటీవల కురిసిన గాలివానకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఆంక్షలు విధించకుండా కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య, నాయకులు కవ్వంలపల్లి సత్యనారాయణ, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ఫక్రుద్దీన్, చరణ్‌పటేల్, బాలసాని రమేష్‌గౌడ్, నాయకులు మేడిపల్లి సత్యం, తొటం రవీందర్, అయిలయ్య, పోడేటి భిక్షపతి, కనుకరత్నం, సముద్రాల కృష్ణ, సాంబయ్య, వెంకట్, నీలిమా, అన్వేష్‌రెడ్డి, సుకినె సంతాజీ, ఇంద్రసేనారెడ్డి, దాట్ల రాముడు, మాల్లారెడ్డి, ముప్పు మహేందర్, మండ సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ సంపదను దోచుకుంటున్న కేసీఆర్ కుటుంబం

హన్మకొండ చౌరస్తా: బంగారు తెలంగాణ చేస్తానని చెప్పి కేసీఆర్ కుటుంబం రాష్ట్ర సంపదను దోచుకుంటుందని సీఎల్‌పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. హసన్‌పర్తి వద్ద ఏర్పాటు చేసిన కార్నర్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఎక్కడా డబుల్‌బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేసిన దాఖలాలు లేవన్నారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్ సిలిండర్ రూ.500లకే పంపిణీ చేస్తామని, అమ్మహస్తం పథకం పునరుద్ధరించి రేషన్ దుకాణాల ద్వారా 9 సరుకులు పంపిణీ చేస్తామన్నారు.

మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణ

- 24 గంటల్లో నిందితుడి పట్టివేత
- పోలీసులకు ఏసీపీ శ్రీనివాస్ అభినందన

కాజీపేట: ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును అపహరించిన నిందితుడిని 24 గంటల్లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పి.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 63వ డివిజన్ విష్ణుపురి కాలనీకి చెందిన ములుగు దేవేంద్ర ఈ నెల 22న ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటిపక్కనే ఉండే యాదగిరి సురేష్ గొలుసు అపహరించి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా సురేష్‌పై అనుమానం వేసి విచారించగా నేరం చేసినట్లుగా అంగీకరించి గొలుసును అప్పగించాడన్నారు. చోరీ జరిగిన వెంటనే స్పందించి నిందితుడిని గుర్తించిన సీఐ సార్ల రాజు, ఎస్సై ప్రమోద్‌కుమార్, క్రైం కానిస్టేబుల్ బి.భాస్కర్, కమలాకర్‌లను ఏసీపీ అభినందించారు. త్వరలో సీపీ డాక్టర్ ఏవీ రంగనాథ్ చేతుల మీదుగా రివార్డు ఇవ్వనున్నట్లు ఏసీపీ వివరించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్సైలు మాచర్ల శ్వేత, ప్రమోద్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఏసీపీ శ్రీనివాస్

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

రామన్నపేట : రాత్రి సమయంలో నగరంలో పార్క్ చేసిన వాహనాలను దొంగిలిస్తున్న దొంగను ఇంతేజార్‌గంజ్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రతిరాంతండాకు చెందిన గుగులోత్ నవీన్ తొర్రూర్‌లో ఒక కాలేజీలో చదువుతున్నాడు. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేయడం ప్రారంభించాడన్నారు. ఇలా రాత్రి సమయంలో వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను కీ లేకుండా స్టార్ట్ చేసి తీసుకెళ్లి వాటన్నింటిని ఒకేసారి అమ్మాలని వరంగల్ రైల్వేస్టేషన్ పార్కింగ్ ఏరియాలో దాచిపెట్టేవాడని తెలిపారు. ఇలా అమ్మడానికి ఇద్దరిని సంప్రదించి బేరం కుదుర్చుకున్నాడని ఏసీపీ తెలిపారు. సోమవారం ఇంతేజార్‌గంజ్ పోలీసులు జరిపిన వాహనాల తనిఖీల్లో అనుమానంగా కనిపించిన నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీఐ మల్లేష్, ఎస్సై నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు శివ, ఉపేందర్, రాజశేఖర్, ఏఎస్ఓ సల్మాన్‌లను ఏసీపీ అభినందించారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

- ఆరుగురు కూలీలకు గాయాలు

దంతాలపల్లి: ఆటో వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో ఆరుగురు కూలీలకు గాయాలైన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, క్షతగాత్రుల కథనం ప్రకారం ..తొర్రూరు మండలం చింతలపల్లికి చెందిన రాజబోయిన దూడాలు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దినచర్యలో భాగంగా అదే గ్రామానికి చెందిన 15 మంది వ్యవసాయ కూలీలు ఆటోను అద్దెకు తీసుకొని మరిపెడ మండలం వీరారం గ్రామ సమీపంలో మిరపకాయలు ఏరటానికి వెళ్లారు. పనులు ముగించుకొని తిరిగి వస్తున్న క్రమంలో నెల్లికుదురు మండలం బ్రాహ్మణకొత్తపల్లికి చెందిన తాళ్ల యాకయ్య తన బైక్‌తో వ్యక్తిగత పనిపై దంతాలపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి కూలీలతో ఆటో వస్తుంది. ఈ క్రమంలో రోడ్డుపై ఆగి ఉన్న ఇన్నోవా వాహనం తప్పించబోయి వాహనదారుడు రోడ్డు పైకి రావడంతో వెనుక నుంచి వచ్చి ఆటో ఢీ కొనడంతో ఆటో పల్టీ కొట్టింది. కె రాధిక, నాగుల బోయిన గంగ, ఏర్పుల సోమలక్ష్మి, కొండూరి పిచ్చమ్మ, కొండూరి పద్మ, కమటం సామ్రాజమ్మలకు గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై కూచిపుడి జగదీష్ 108 వాహనంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సైని అడుగగా ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

వైద్య విద్యార్థుల బయోమెట్రిక్ షురూ

- రెండే పరికరాల ఏర్పాటుతో గందరగోళం
- హాజరు శాతం నమోదు చేసేందుకు ఇబ్బందులు

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న అన్ని బోధనాస్పత్రుల్లో సోమవారం నుంచి బయోమెట్రిక్ హాజరుశాతాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. క్లినికల్ సేవలందిస్తున్న వైద్య విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపర్చడం, వారిపై ప్రత్యేక దృష్టి సారించేందుకు రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ప్రభుత్వం కేఎంసీని ఎంచుకుంది. ఈక్రమంలో వందలాది మంది విద్యార్థులు హాజరయ్యే ఎంజీఎంలో రెండే పరికరాలను ఏర్పాటు చేయడం గందరగోళానికి దారి తీసింది. ఉదయం 9 గంటలకు ప్రతీ విద్యార్థి తమ బయోమెట్రిక్ హాజరు వేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఎంజీఎం ఆర్ఎంఓ కార్యాలయానికి ఎదురుగా ఉన్న గదిలో బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేశారు. హాజరు నమోదు చేసుకోవడానికి వచ్చిన వైద్య విద్యార్థులకు బయోమెట్రిక్ ఎక్కడుందో తెలియక కొద్దిసేపు ఇబ్బంది పడగా.. పరికరాలు ఏర్పాటు చేసిన గదికి తాళం వేసి ఉన్న విషయాన్ని గుర్తించారు. ఈ గది తాళం 10 గంటల వరకు తెరవకపోవడంతో వందలాది మంది విద్యార్థుల హాజరు శాతం నమోదు చేసేందుకు పరిపాలనా కార్యాలయం వద్ద ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే.. కొందరు విద్యార్థులను బయోమెట్రిక్ పరికరం గుర్తించలేదు. ఈ విషయంపై ఎంజీఎం పరిపాలన అధికారులను వివరణ కోరగా.. లోపాలను సరి చేసి విద్యార్థులకు అనుకూలంగా బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేస్తామని అధికారులు స్పష్టం చేసారు.



నమోదు చేసేందుకు గుమిగూడిన వైద్య విద్యార్థులు

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో నలుగురు
- నాలుగు ఫోన్లు, రూ. 5.50 లక్షల నగదు స్వాధీనం

మహబూబాబాద్ రూరల్ : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్, టౌన్ పోలీసులు గత కొన్ని రోజులుగా క్రికెట్ బెట్టింగ్‌పై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం పక్కా సమాచారంతో క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే నలుగురి నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి నాలుగు ఫోన్లు, రూ. 5.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. బెట్టింగ్‌లో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏలూరు జిల్లాకు చెందిన వలగాని రామకృష్ణ, ఖమ్మం వాసి తొట్టెంపూడి విక్రమ్, చార ప్రవీణ్ కుమార్, గుంటూరుకు చెందిన ఆనంద్ కిరణ్ కలిసి మహబూబాబాద్ పట్టణంలో బెట్టింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. యువత బెట్టింగ్‌ను ప్రోత్సహించే విధంగా ప్రచారం చేస్తూ పట్టుబడ్డారన్నారు. వీరు బుకీలుగా వ్యవహరిస్తూ చైన్ లింకింగ్ సిస్టం ద్వారా బెట్టింగ్ ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, తెలంగాణలోని మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో వీరు బెట్టింగ్ టీంలను ఏర్పాటు చేశారన్నారు. ఈ క్రమంలో మహబూబాబాద్‌లో బెట్టింగ్‌లు వాళ్లకు నచ్చిన జట్టు మీద బెట్టింగ్ కాసి వలగాని రామకృష్ణ వీరు చెప్పిన జట్టు మీద ఎంత డబ్బులు బెట్టు పెట్టారో నోట్‌బుక్ లో నోట్ చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. బెట్టింగ్‌కు సంబంధించిన నగదును ఆన్‌లైన్ ద్వారా ముందుగానే తీసుకోవడం, మ్యాచ్ అనంతరం గెలిచిన వారికి నగదును ఆన్‌లైన్ ద్వారానే బదిలీ చేయడం జరుగుతుందని తెలిపారు. గత కొంతకాలంగా మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల పరిధిలో విక్రమ్, ప్రవీణ్ కుమార్, ఆనంద్ కిరణ్ బెట్టింగ్ చేస్తూ, బెట్టింగ్‌ను ప్రోత్సహించడం చేస్తున్నారని తెలిపారు. అరెస్టు చేసిన వారిలో వలగాని రామకృష్ణ, తొట్టెంపూడి విక్రమ్, ఆనంద్ కిరణ్, దార ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. క్రికెట్ బెట్టింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని మహబూబాబాద్ పోలీసులకు వాట్సాప్ నంబర్ 8712656999లో తెలియజేయాలన్నారు. సమాచారం సేకరించి నేరస్తులను పట్టుకున్న మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు సంతోష్, రమేష్ బాబు, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, రామకృష్ణ, దిలీప్, వీరస్వామిలను జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించి, రివార్డులు అందజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్

మహబూబాబాద్ డీడీకి పుత్రశోకం



నివాళులర్పిస్తున్న ములుగు కలెక్టర్ కృష్ణ ఆదిత్య



పరామర్శిస్తున్న కలెక్టర్ శశాంక, పీఓ అంకిత్

- గుండెపోటుతో తనయుడి మృతి

ఎస్ఎస్‌తాడ్వాయి/ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని మహబూబాబాద్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మంకిడి ఎర్రయ్యకు పుత్రశోకం మిగిలింది. మంకిడి ప్రదీప్‌కిరణ్‌కుమార్(31) ఆదివారం రాత్రి అకాల మరణం చెందాడు. హనుమకొండలోని గోపాలపురంలో ఎర్రయ్య కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి కుమారుడు ప్రదీప్‌కు ఛాతిలో నొప్పి వస్తుందని కుప్పకూలిపోయాడు. సీపీఆర్ చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ప్రదీప్ ఇంట్లోనే ఉండి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ప్రదీప్‌తోపాటు మరో కుమారుడు, కుమార్తె ఉంది. చేతికి అందిన పెద్ద కుమారుడు మృతి చెందడంతో ఎర్రయ్య కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.



ప్రదీప్‌కిరణ్ కుమార్ (ఫైల్)

నర్సాపూర్‌లో అంత్యక్రియలు

మహబూబాబాద్ డీడీ మంకిడి ఎర్రయ్య కుమారుడు ప్రదీప్‌కిరణ్‌కుమార్ మృతి చెందగా ఆయన స్వగ్రామమైన తాడ్వాయి మండలం నర్సాపూర్ (పీఏ) గ్రామానికి సోమవారం ఉదయం తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపించారు. ములుగు, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు కృష్ణ ఆదిత్య, శశాంక, ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్‌లు భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే జెడ్పీ వైస్‌చైర్మన్ బడే నాగజ్యోతి, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఆదివాసీ సంఘాల నాయకులు, ఉద్యోగస్తులు, ఐటీడీఏ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి పరామర్శించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్స్

- విద్యార్థులకు ప్రగతిపత్రాల అందజేత
- నేటి నుంచి పాఠశాలలకు సెలవులు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ తదితర పాఠశాలల్లో చివరి పనిదినం సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించారు. ఈసమావేశంలో విద్యార్థుల అకాడమిక్ సామర్థ్యాల సాధనపై తల్లిదండ్రులకు సూచనలిచ్చారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలిపారు. ఇటీవల ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు వార్షిక పరీక్షలు నిర్వహించారు. అందులో వచ్చిన మార్కుల ప్రగతిపత్రాలను ఆన్‌లైన్‌లోనూ సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ క్యూమిలేటివ్ ప్రగతి పత్రాలను ప్రతీ పాఠశాలలోనూ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు అందించారు. కొన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు కొంతమేర హాజరు కాగా.. మరికొన్ని పాఠశాలల్లో అంతంత మాత్రంగానే.. హాజరైనట్లు సమాచారం. పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు ప్రగతిపత్రాలు అందించారు. విద్యార్థులకు తల్లిదండ్రులకు హెచ్‌ఎంలు పలు సూచనలు చేశారు. సోమవారంతో ఈవిద్యా సంవత్సరం ముగిసింది. ఈనెల 25 నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు సెలవులు. మళ్లీ పాఠశాలలు జూన్ 12న రీ ఓపెన్ చేస్తారు. అయితే జూన్ ఒకటి నుంచి బడిబాట ఉండే అవకాశం ఉండే అవకాశం ఉంది.




నారాయణగిరి స్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశం

విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

- స్తంభం ఎక్కి పని చేస్తుండగా విద్యుత్ షాక్

గార్ల: విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని పోచారంలో చోటుచేసుకుంది. విద్యుత్‌శాఖ సిబ్బంది, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గార్ల మండలం పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వాంకుడోత్ ఉపేందర్ (43) గత 18 ఏళ్లుగా గార్ల విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత రాత్రి వీచిన గాలిదుమారం ఈదురుగాలులకు పోచారం పంచాయతీ పరిధిలో 11 కేవీ విద్యుత్‌స్తంభం ఒరిగి వేరే విద్యుత్ లైన్‌మీద పడింది. విధి నిర్వహణలో భాగంగా ఉపేందర్ పోచారం వెళ్లి ఎల్‌సీ తీసుకొని, వేరే లైన్ ఎల్‌సీ తీసుకోకుండా మరమ్మతు చేస్తుండగా విద్యుత్ షాక్ గురై స్తంభంపై నుంచి ఉపేందర్ కిందపడిపోయాడు. విషయం తెలిసిన వెంటనే విద్యుత్ ఏఈ మహేంద్రబాబు హుటాహుటిన ఉపేందర్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స జరుగుతుండగా పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. వైద్యం చేయిస్తుండగా ఉపేందర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.



ఉపేందర్ (ఫైల్)

రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

విధి నిర్వహణలో మృతి చెందిన కాంట్రాక్ట్ ఉద్యోగి ఉపేందర్ కుటుంబానికి విద్యుత్‌శాఖ రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. అదే విధంగా కుటుంబంలో ఒకరికి విద్యుత్‌శాఖలో ఉద్యోగం కల్పించాలని నాయకులు కందునూరి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, సక్రు, రామారావు కోరారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



వెంకన్న (ఫైల్)

కురవి : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం సీరోలు మండలం చింతపల్లి శివారు భూక్యతండాలో చోటు చేసుకుందని సీరోలు ఎస్సై ఎల్.నరేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..భూక్య తండాకు చెందిన మాజీ సర్పంచ్ సాంక్రియా నాయక్ పెద్దకుమారుడు భూక్య వెంకన్న(45) కుటుంబ కలహాలతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం కోసం మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన వివరించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తండాకు చేరుకుని సాంక్రియానాయక్‌ను, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య, ఎంపీటీసీ బోజ్యానాయక్, మాజీ ఎంపీటీసీ చందూలాల్, మాజీ సొసైటీ చైర్మన్ బీకోజీనాయక్, నాయకులు మామిళ్ల వెంకన్న, బాలాజీ, నరహరి, ఉపసర్పంచ్ జేరిపోతుల రంగన్నగౌడ్, దేవ్‌సింగ్, పత్తిసింగ్ ఉన్నారు.

అదృశ్యమైన వ్యక్తి... శవమై కనిపించాడు



సాయిలు (ఫైల్)

కేసముద్రం: ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన ఓ వ్యక్తి..చెరువులో శవమై కనిపించిన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తికి చెందిన కొమ్మనబోయిన సాయిలు(48) ఓ రైతు వద్ద జీతం ఉన్నాడు. అయితే బావిలో మునిగిన విద్యుత్ మోటార్లను తీసే గజ ఈతగాడిగా సాయిలుకు మంచి పేరుంది. ఈనెల 21న భార్య నాగమ్మ పనికి వెళ్లగా, ఆ తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయిలు తిరిగి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఇనుగుర్తి గ్రామశివారు గుంటి చెరువులో మత్తడివైపునకు సాయిలు మృతదేహం తేలి ఉండగా అటుగా వెళ్లిన ఓ వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబ సభ్యులు చెరువువద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని, మృతదేహన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాయిలు చెరువులో శవమై కనిపించడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

చివరి రోజు సరుకులు మాయం

గూడూరు: వేసవి సెలవుల దృష్ట్యా పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పాఠశాలలో మిగిలిన సరుకులను ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బంది తీసుకెళ్తూ గ్రామస్తులకు పట్టుబడిన సంఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వేసవి సెలవుల దృష్ట్యా మంగళవారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. దీంతో ఆశ్రమంలో మిగిలిన సరుకులను గుర్తించి రిజిస్టర్‌లో రాసి వెళ్లాలి. కానీ ఈ పాఠశాలలో మాత్రం అందులో పనిచేసిన సిబ్బంది ప్రిన్సిపాల్‌తో, తిరిగి పాఠశాల ప్రారంభమయ్యే వరకు మిగిలిన సరుకులు పురుగులు పట్టి పాడవుతాయి. మిగిలిన పప్పులు పని చేసిన తమకు అరకిలో చొప్పున ఇవ్వమన్నారు. దీంతో ప్రిన్సిపాల్ వసంత మిగిలిన 5 కేజీల పప్పును సిబ్బందికి ఇచ్చింది. మిగతా సరుకులను తమ బ్యాగ్‌లో పెట్టుకొని పాఠశాలకు తాళం వేసి బయలుదేరారు. ఈ దృష్యాన్ని ముందుగా తెలుసుకున్న గ్రామస్తులు గేటు ఎదురుగా ఉండి వీడియో తీయడం గుర్తించిన ప్రిన్సిపాల్ సరుకులను వదిలేసి వెళ్లింది. ఈ సంఘటనపై ప్రిన్సిపాల్ వసంతను వివరణ కోరగా సిబ్బంది అడిగితే ఇవ్వడం జరిగిందన్నారు. సిబ్బంది తీసుకెళ్లిన సరుకులను తిరిగి సేకరిస్తానని సమాధానమిచ్చారు.